*కృతి

రామచయనులు పూర్వమీమాంసకుఁడు. క్రతువు లన్నియుఁ గ్రమముగా నొనర్చిన కర్మజ్యేష్ఠుఁడు. అతఁడొకనాఁడు శ్రవణ మొనరింప నెంచి శతవృద్ధుడైన బ్రహ్మశాస్త్రి కడకేఁగి వందన మొనర్చి– అయ్యా! కవులు యథార్థవాదులు; సత్యకథ నేదేని చెప్పుదురని తమకడ కరుదెంచితినని మనవిచేసెను.

బ్రహ్మశాస్త్రి యాశీర్వదించి చిఱునవ్వు నవ్వి యిటులు చెప్పెను. నేను సహస్రాధికరణ పరిమితమగు నొకగ్రంథమును విరచించితిని. నాయుపదేష్ట లెవరికి సంబంధించిన యధికరణమును వారికిఁ గృతియిమ్మని యాజ్ఞాపించిరి. అందులకుఁగాను దగువారిని వెదకివెదకి యాయాయి యధికరణముల నా యాయివారికిఁ గృతియిచ్చితిని. కాని వా రంతయు విని మా కక్కఱ లేదని లేచిపోయిరి. ఇటులు కాఁగాఁ దొంబదినూటఁ దొమ్మిది యధికరణములను మహాకోపముతో నదిలోఁ బాఱవైచితిని. ఈ మిగిలిన యొక యధికరణము కర్మిష్ఠుల కంకితము చేయవలసియుండఁగా వారిని వెదకికొనుచుఁ బోయి యొకొక్కనికే యంకితము చేయమొదలిడితిని. వారు మొదటి ఘట్టమునుండియు నుపోత్తమఘట్టము వఱకును వినుటకుఁ జెవులు కోసికొనిరి. చివరకు వచ్చువఱకుఁ జిరాకుతో నాచమించి నీరు చల్లికొనుచు లేచిపోయిరి. నాకును విసువు పుట్టి మిగిలిన యధికరణములతోపాటీ యధికరణమును గూడ నదిలోఁ బాఱవైచితిని. ప్రతిపర్యాయము ప్రతితాటాకుగూడ నెదురీఁత యీఁది నాకడకు వచ్చినది.

రామ – ఎంత మహత్తు! ఐతే యిది ఋషి ప్రోక్తమనుకొందును.

బ్రహ్మ – ఔను. దీనిని గౌతముఁడు మనోమహాశయున కుపదేశించెను. మనోమహాశయుఁడు వాఙ్మహాభాగునకు.

రామ – ఈ కాలమున క్రీస్తుశకము 1614వ సంవత్సరమున వెంకినీఁడు వేఁగి దేశమును బరిపాలించుచుండెనని వ్రాయుదురు. దానినే ఋషి చెప్పెను? సామాన్య మానవుఁడేమి ప్రమాణము? సామాన్యముగా వ్రతములలోఁగూడ నాముని యీ మునికిఁ జెప్పెను. ఈ ముని యా ఋషికిఁ జెప్పెను. ఆ ఋషి యీ ఋషికిఁ జెప్పెను. ఈ ఋషి

---

* శివరామశాస్త్రిగారు రాసిన తొలి కథ.

ధర్మరాజునకుఁ జెప్పెను. ధర్మరాజు దాని నాచరించి క్రమముగాఁ బంద్రెండేండ్ల రణ్యవాసమాచరించి పిదపనొకయేఁడ జ్ఞాతవాస మొనరించి తుదకు యుద్ధ మొనర్చి రాజ్యముఁ బడసె నని యుండును. కథ యాట్టే లేకుండినను ఋషులే కథ. మన యార్యులకు ఋషులే కథకులు. వారి కథ లతిరూఢములు సుమండి! ఏ దేశములో నేమంచి కథలున్నను నవి ఋషిప్రోక్తములే యనుకొనుఁడు. 'నానృషిః కురుతే కావ్యమ్?' ఇవే కాదు. యంత్రములు? ఇంకను! ఆహా! యుద్ధమో! అధర్వణ మంతయు యుద్ధమే! దాని నుచ్చరించుచో విండ్లలోనుండి తూపులుపోవును అవన్నియు నతిగూఢములు!

బ్రహ్మ – అయితే యీ కథ మాత్రము గూఢము కాదు. వాయూదకములవలె నెల్లర కందఁజేయుమని వాఙ్మహోభాగుని యాదేశము..

రామ – నే నిఁక నగారా యనుకొనుఁడు.

2

బ్రహ్మశాస్త్రి యిటులు చెప్పెను :

తొల్లి యొకానొక భూఖండమునఁ గొందఱు మేము మనుజుల మని తెలిసికొనిరి.

రామ – ఆహాహా! ఎంత విచిత్రులండీ! తెలిసికొనిరిగా!

బ్రహ్మ – ఔను. మఱియు వా రచటఁ గల కొండలను నదులను సరోవరములను వెలుఁగును జీఁకటిని గాలిని మింటిని నిప్పును నీటిని సూర్యుని జంద్రుని నక్షత్రములను నుప్పు బెల్లములవలె నుపయోగించు కొనఁజొచ్చిరి. అపుడు సృష్టి యీశ్వరుని యొడిలో బాలికవలెనులాలింపఁబడెను.

రామ – అయ్యో! పూర్వపక్షములలో వాణీ కాంచికాఘంటికవలె మ్రోఁగు నా నాలుక స్పందింపకుండఁజాలదు! క్షమింపఁ గోరెదను.

బ్రహ్మ – అది నాకును నుపయోగమే. అసలొక యధికరణమే మిగిలినది. అదియు మిగులఁ జిన్నది. లావుకాకితములపై నచ్చొత్తింప నెంచుచున్నానుగాని వెల చాల నెక్కుడుగా నున్నది. ఇపుడా బాధ లేదు. మీ పూర్వపక్షములుకూడఁ గలిపినచో గ్రంథము విపులమయి యొకపుస్తకముగాఁ గూరును.

రామ – ఆ భూఖండము నేఁటికిని గలదా? అటకుఁ బోయినచో నగ్నిహోత్రగృహము నందున్నటులుండవచ్చును.

బ్రహ్మ – నావికుని బిలుతురుగాని.

రామ – సముద్రయానము నిషిద్ధముకదా!

బ్రహ్మ – ఓహో చిక్కే! కాని మనస్సు శుద్ధి చేసికొన్నచో నీకథ విని మీ శరీరమునే నావగా నటకు నడిపింపవచ్చును.

రామ – స్వామీ! మన్నింపుఁడు. మఱియొక శంక. అంతయుఁ దెలిసిన విజ్ఞులు కదా! తామానందనవనమునకుఁ బోవక యీ శ్మశానమున నున్నారేమి?

బ్రహ్మ – నే నీరెంటికి నడుమ నున్నాను.

రామ – ఇదేమి చమత్కారము? ఆ కథ నంతయు నొక గుక్కలోఁ జెప్పుఁడు.

బ్రహ్మ – వారు భూగుహాలో నగ్నులైయున్న సస్యదేవతను గనుఁగొనిరి. 'నోరుగలవాని దే రాజ్యము'ను మాట వారినాఁటిదే. వారికిఁ జెట్టులలో నాహారము, తేనె పట్టులలో మద్యము, ప్రత్తిచెట్టులలో వస్త్రములు కానిపించెను. ఇంతియకాక వారి నాలుకలకూ జంతువులలోని మాంసమునకూ అనివార్యమగు సంబంధము కలిగెను.

రామ – బ్రాహ్మణులు కూడ మాంసము?

బ్రహ్మ – వారి నరత్వమప్పటికి బ్రాహ్మణత్వమును బ్రసవింపలేదు. అపుడు జను లంద ఱొకగూఁటి పిట్టలు. కాని బ్రాహ్మణత్వము పుట్టినపిదప యౌవనాంతముదాఁక మాంసమును దినెను. ఐదైదు గోళ్లపిట్టలు మొదలగు రుచ్యములు నారోగ్యకరములు నగు మాంసము మన దేశములోఁగూడఁ దినలేదా?

రామ – అది యుగాంతరవిషయము.

బ్రహ్మ – ఇదియు.

రామ – ఆహాఁ! పైని జెప్పుఁడు.

బ్రహ్మ – అపుడాఁడుది సగము తల్లి సగము తండ్రి. ఆమె తన జీవికకై పురుషునితో పాటు పాటుపడెను. ఆమె నగ్నశిలావిగ్రహమువలె గంభీరసుందరియు. అగ్ని వలెఁ బవిత్ర, చంద్రునివలె రమణీయ. గాలివలె స్వేచ్ఛాచారిణి. తన యిచ్ఛయే సహచరుని వరించును. తన కిష్టము లేనినాఁడు పురుషుఁడు పిశాచము.

రామ – ఏమీ? మన మట కేఁగుచో మన స్త్రీలుకూడ నటులు కారుకద?

బ్రహ్మ – అగుచో మీరును నచటి పురుషులుగా మాఱరా? కాని బెంగ పెట్టుకొనకుఁ డు: ఇపు డది మాఱినది. అచట నిపుడాఁడుది పురుషేచ్ఛయను చెఱసాలలో దొంగ.

రామ – భేష్.

బ్రహ్మ – అచటఁ గొందఱు పురుషులు స్త్రీలును గవితయను నొక విచిత్ర భాషలోఁ బ్రకృతి పురుషులతో సంభాషింతురు. వారిభాష కాలమువలె దీర్ఘము. ఆకాశమున్నంతపట్టు మ్రోఁగును. అది యానంద డోల.

రామ - అయ్యయో! కవులా? కవులూ కదపాలూ! అసత్యవాదు లచటనూ చేరిరా?

బ్రహ్మ - వారు సంపూర్ణసత్యము తెలియఁ జేయుటకు మాత్రమే యసత్య మాడుదురు. వారి మాట పాట, వారు నవ్వి యేడిపింతురు. దుఃఖమును సుఖింపఁ జేయుదురు. ఒకటిలో వేయి వేయిలో నొకటి చూపుదురు. వారి భాషయే సత్యభాష, దేవభాష. అట్టి భాషతో మాటలాడినవారింత పట్టు మృతి యెఱుఁగరు.

రామ - వారు నాకుఁ గానిపింతురా?

బ్రహ్మ - వారు వ్యాఖ్యాన విషములచేఁ జచ్చిరి కాని హృదయ దృష్టిలో నమృతులు.

రామ- ఇఁక వడిగాఁ జెప్పుఁడు.

బ్రహ్మ - వారిలోఁ గొందఱు బలోపాసకులు. వారినుమునైనను నీఱు చేసిరి. పర్వతములను బిండిగొట్టిరి. అపుడు జనులు విత్తిన విత్తనములను భూమి యావువలెఁ దిని వైచుచుండెను. పోసిన నీటిని ద్రావివైచుచుండెను. అది చూచి యొకఁడు నేలను దన్నెను, దున్నెను, త్రొక్కెను, త్రవ్వెను, బుద్ధగించెను. అంతటితో దాని పెంకెతన మంతయుఁ జదునాయెను.

మఱియొకఁడు భగీరథ ప్రయత్నములు చేసి కొండలనుండి వాగులను దెచ్చెను. వారిలోఁ గొందఱు ఋషులుకూడ నుండిరి. ఆయాయివాగులు నేఁటికిని వారివారి పేర్లచే వ్యవహరింపఁబడుచున్నవి. ఈ నీటిచేఁ దన పిపాస తీఱ భూమి మనుజులు తమలోన దాఁచికొనిన విత్తులకు సహస్రాధికముగా ఫలింపఁ జొచ్చెను. నాఁటినుండియు నగ్నయగు సస్యదేవత పలురంగులచీరలు దాల్చి భూమి నంతయుఁ దనకుఁ గ్రీడారామముగాఁ జేసికొనెను. దాని వాహనమగు వృషభము నాఁటి నుండియు సత్కరింపఁబడుచుండెను.

ఆ సస్యదేవతనుండియు భూమిలోని లోహములనుండి లక్ష్మిపుట్టఁగా దాని నందఱు నారాధించిరి. కొందఱామె నుపాసించి తమ తేజస్సును వృద్ధిపఱిచికొనిరి. మఱికొంద రధికారము నసూయను సంపాదించికొనిరి. ముఖ్యముగా స్త్రీలు లక్ష్మీసంపన్నలైరి. ఇది వారికి లాలసతను బిఱికితనమును మప్పెను. దీనిచే వారిరాజ్యమున నూతన సింహాసన మేర్పడెను.

పెక్కురు భూధేనువునుండి సస్యక్షీరములఁ బితుకువారైరి. దానఁ బరస్పర సంఘర్షణముచే జనులు తమ శక్తికొలఁది నాబాతు చేసికొనవలసిన వారైరి. అందుఁ దేఱినవాఁడు శక్తిమంతుఁడూ పలువుర నధీనులఁ జేసికొనెను. ఇటులు రైతులో నుండి రాజు వచ్చెను.

అచటి జను లందఱకుఁ గొందఱు తినుబండాలము మొదలగు వస్తువుల నందఁ జేసి జీవిక యేర్పఱిచికొనిరి. ఇటులు కాఁగా జనులందఱు ముఖ్యముగా నలుఁదెఱఁగులగు పనులఁ జేయవలసివచ్చిరి. కొన్నాళ్ల కివియే నాలుగువర్ణములుగా ముద్రితములాయెను. రాజ్యము చేయువారును అమ్మువారును దున్నువారును గూడఁ దీరికచేసికొని కొందరకడ జ్ఞానము సంపాదించుకొనుచుండిరి.

పని పనిలోనే పరిసమాప్తమగును. జ్ఞానమున కన్నిపనులును నిర్విశేషములు. అది యేలును. అమ్మను. దున్నును. పిడపఁ జాలఁగాల మాద్వీపాంతఃపురమున సృష్టి రాచకన్నెవలెఁ బెరిఁగెను.

నీవు బ్రాహ్మణుఁడవే యగుదువుగాక; నీయిల్లు నీవు కట్టుకొన్నచో వడ్రంగివి. నీ వస్త్రమును నీవు నేసికొనుము; సాలెవు. నీ నేల నీవు దున్నుకొనుము; శూద్రుఁడవు. నగచేయు; మగసాలెవు. చెప్పులు కుట్టుము; గొడారివి.

నీటిలో నూనెబొట్టువలె మనుజులలో, బనులపేరులు సంక్రమించును. మనుజుని మోములో వాని పని వాని మతము మచ్చలు కట్టును. నిన్నఁగాక మొన్న దిగెనో లేదో క్రీస్తుమతము ముఖమున సిలువగట్టుకొని తనను గొండాడుకొనుచున్నది. వైష్ణవుఁడు మఱలఁదాను వైష్ణవుఁడే యయి జన్మించుచో నిఁక నతఁడు పంగనామములు తీర్ప నక్కఱ లేదు. 'ఇడుగో స్మార్తుఁడిడుగో స్మార్తుఁడని' బొట్టు అంకెలువైచును.

పనులు వంశక్రమముగా రూఢము కాఁగా నొకటి నాలుగుగా మాఱుటమాత్రమే కాక నాలుగొకటులుగా ఘనీభవించెను. ఆ నాలుఁగును లోహమువలె భిన్నభిన్నముగా మ్రోగును. ఇంతేకాక వీరిసంతతియే పనిచేసి జీవించుచున్నను రక్తముతోపాటు వర్ణముకూడ ననుగమించెను. జ్ఞానము మాత్రము దానియిచ్చ. అయితే అచట నిపుడీశ్వరుఁడే కరచరణాద్యవయవములతోపాటు వర్ణము లతోఁగూడ మనుజుల సృజించెనని కొందఱును నలుదెగలుగా నున్న యీజనులీశ్వర సృష్టియని కొందఱును అభిప్రాయపడుచున్నారు.

రామ - అదేమి? ఒకటి నాలుగుగా మాఱినటులు స్పష్టముగాఁ గానుపించు చుండఁగా మొదటనే నాలుగువర్ణముల నీశ్వరుఁడు సృజించుటేమి? అదియుఁగాక వర్ణము కరచరణాదులవంటిదా? వారి కింకను బుర్రలున్నవా?

బ్రహ్మ - అయ్యా! మనదేశములో?

రామ - నేనా లంకమాట చెప్పుచున్నాను.

బ్రహ్మ - శూద్రునకు వైశ్యరాజన్య విప్రల యందు ఆ యోగవక్షత్త్ర చండాలవర్ణములు పుట్టినవికదా! రెంటినుండి కదా మూఁడవది వచ్చినది! ఆ మూఁడవదాని కీరెంటికంటె వేఱుగా నునికి కలదా? శూద్రుఁడేకదా ....

రామ – ఇది తర్కదూరము. ఇక్కడిసంగతి యెందులకు? ఆ ద్వీపపు సంగతి చెప్పుఁడు.

బ్రహ్మ – పని మనుజుల యెక్కువ దక్కువ లకుఁ గొలబద్ది. రాజునకు లెంకలైనను నొకనిని బ్రగడగను వేఱొకని వేగుగను నొనర్చిన దీ పనియే. రాజు గద్దెపైఁ గూరుచుండును. ప్రగడ దాపున వేగెడముగా నిలువఁబడును. జ్ఞానమే బహుశా పనిని నియమించును.

తమతమ నియతములగు పనులతో వారందఱేక కుటుంబములోని వారయ్యుఁ దమలోఁదాము భోజనవివాహాదుల మానివేయవలసిన వారైరి. కొందఱు బుద్ధిజీవులు మాంసము మానివైచిరి. ఈరెండును వారికిఁ బరస్పర మొకజములు చీనాగోడఁగట్టెను.

రామ – ఔరా! ఎంతటి కుటుంబకలహము! కానఁబడు చుండఁగనే యొకటి రెండై రెండు మూఁడై మూఁడు నాలుగై, నాలుగు నాలుగై పోయినవే! ఇంకను నెన్నియగునో?

బ్రహ్మ – తలవెంద్రుక లన్నియాయెను.

రామ – కాని సులభముగా వారికి సంధి కుదర్పనగును.

బ్రహ్మ – మీబోంట్లు కలహము నాఁపలేరు కదా మఱికొంచె మెక్కువ చేయుదురు.

రామ – ఆ! విరోధముతో మనకేమి? ఇఁకఁజిటికలోఁ దెలుపుఁడు.

బ్రహ్మ – మనస్సున కిచ్చ సారథి. దాని నిలయము నియమమున కావల. దాని నఱకుము. చిగుర్చును. ఇంతవట్టు దాన కట్టు ద్రాళ్లెవరికిని దొరకలేదు. అది యీశ్వరుని యపత్యము. దాని జీవిక గుణలావణ్యముల మీఁద. రజఃకణములవలె దుఃఖములు దాని కంటుకొనును గాని యది గొఱియవలె నొక్కసారి దులపరించును. అది రెక్కలు విప్పుచో విభాగము మూసికొనుచో ముద్ద. అది విభాగము నుండి యైక్యములోనికిఁ బరువిడును. వర్ణములయెడ నది గ్రుడ్డిది. కత్తులబోను పెట్టినను నది రాక్షస వివాహము చేసికొనును. కంటక ద్రుమముకదా యని పూవును బాఱవైవదు. చంద్రుఁడుకదా యని మచ్చను మాఁటుకొనదు. దానికొక కన్నుకలదు. అది దాని కర్ణికచే ననురూపమగుదాని నేఱికొనును.

ఆ ద్వీపమున వర్ణనియమమునెడ నతి జడమగు మనస్సు స్త్రీపురుషుల గుణలావణ్యములలోఁ గలసిపోయెను. నాఁటనుండి కేవలము పనులనుండి కాక జన్మము నుండికూడ వర్ణములు తెగలు తెగలుగాఁ బొడమెను. ఆ వర్ణముల యాదిపురుషులను దమతండ్రులుగాఁ జెప్పికొనుటకు వారు జంకిరి. వారి కరణ్యమే యనాథశరణాలయము. పిట్టలు శకుంతలను వలెనే కొన్ని మృగములు వారిని బెనిచి యుండును. తొలుతటి నుండియు నారణ్యకులుగా నున్నవారి కీ శిశువులు దైవప్రసాదము.

మనుజుండు జంతు శవమునుండియును దోలు నుపయోగించుకొనును. పనికి వచ్చునదుండు నెడలం దిమింగల శయనమగు సముద్ర నిమ్న పల్వలమునం గాంపుర ముండంబోవును.

శిశువు బాలుని బాలుండు కుమారుని కుమారుండు యువకుని యువకుండు వృద్ధుని ననుసరించుటలో గొటియలు. స్వభావము జాతిని దనముడిలో ముడిచి ముద్రవైచుచున్నది. మాలనియందు మనుజులలో లేని జంతుస్వభావము కలదా?

ధూమము గాలిలోఁ దనకు వలయునంత చోటునాక్రమించును. అస్పృశ్యులైనను నొక యుసిల్ల పుట్టయగునేని కొంత తావును బలాత్కరింతురు. శిష్టులుగూడ వారినుండి తమకుఁ గావలసిన పనిని సుంకము కొందురు. ఇటులు వారికిఁ గలయిక కలుగదేని ప్రలయము సంభవించును. ఆ సంబంధ విఘటనములే ధర్మశాస్త్రమునందలి విషమ ఘట్టములు.

ఆ ద్వీపమున నట్టి సంఘ మెక్కుడైన కొలఁది ధర్మశాస్త్రము మాఱెను. ఒకదాని కింకొకటి పోలనంత మాఱుపులు జరిగెను. హీనవర్ణముల వారొక గుఱుతుతో గ్రామము లోనికి రావలసియుండెను. గ్రామములోనికి వచ్చునెడ మెడ కొకకుండఁ గట్టుకొని యందుమియవలయును. వాని జూచుచో బాఁపఁడు సచేలస్నానము చేసెను. వాఁడు శ్మశానమునకు మంత్రి. జంతుశవములకు రాజు, నడచు కంకాళము.

సస్యదేవత యొకతెమాత్రమే యతనిఁ బ్రేమించెను. పరిత్యాగము ప్రసాదించిన రమణీయమగు మోటుఁదనమునకును విశ్వసింపఁదగిన బలమునకును దగిన యుద్యోగ మతఁడు గ్రహించెను. అతఁడు మాటయాడెనా హరిశ్చంద్రుఁడు. ప్రతిఘటించెనా పరశురాముఁడు. కొంతకాలమున కతఁడు కాఁడియెడము పుడికి పుచ్చికొనఁ గలిగెను.

రామ - ఇది యంతయు మగ్గములోఁ దెగిన దారముల ముడివలె నున్నది. అక్కడఁ గూడ ననులోమసంకీర్ణాది జాతులు కలవు కాఁబోలు. ఏమి యీముడి?

బ్రహ్మ - ఈ ముడి యాదారము లదేనా?

రామ - మఱి యెటనుండి యూడిపడినది? సరి కాని, అయ్యా! అటఁ జందాలురు, ఆదిమాంధ్రులు కలరా?

బ్రహ్మ - అబ్బా! ఎంతబలువుగా నుచ్చరించితిరి? సరస్వతీదేవి నక్కెళ్లు నొక్కికొని పోయినవి. ఔను. ఆ ముడిలోని దారములే.

రామ - కొంప తవ్వి -

బ్రహ్మ - ఇపు డచటఁ బెద్దయుద్ధము వచ్చినది. ఈ కుటుంబ కలహమును మాఁ పు కొనవలెనని కొందఱును అటులే యుంపవలెనని కొందఱును బయలుదేరిరి.

రామ - మాఁపవలె నని?

బ్రహ్మ - ఆ ద్వీపమునందు - మాలఁడైనను సరియు; బాపఁడైనను సరియ నా కతఁడు గురువని యొకఁడనెను. కొండొకఁడు వారిని బాహిర పెట్టినందుల కా తప్పంతయుఁ దనతలఁదాల్చికొని విరియఁబాఱిన వెంట్రుకలే చీపురుకట్టగా వారి వాకిళ్లూడ్చెను. ఇంకొకఁడు తనకిపుడే ముక్తి కలుగునెడలఁ జండాలజన్మము పొందికాని దాని నిచ్ఛగింప ననుచున్నాఁడు.

రామ - అబ్బా! విసువుగా నున్నది. బ్రాహ్మణులు మాత్రమే కల కృతయుగ మెన్నఁడేని వచ్చునా?

బ్రహ్మ - అది యెపుడును సిద్ధమయియే యున్నది. మాల మాదిగ డెక్కల మొదలు కొని శూద్ర వైశ్య క్షత్త్రియ బ్రాహ్మణుల వఱకుఁగల వర్ణవస్త్రము లన్నియు నొక యేకులోనుండియే వచ్చినటులు తెలిసికొన్న లిప్తలోఁ గృతయుగ మున్నది.

రామ - ఔరౌరా! మీకును ఈపుండే పుట్టినదీ! గౌతముఁడు చెప్పెనంటిరి. ఏదో ద్వీపమంటిరి. తుదకు మాలగూడెమునకు బ్రాహ్మణపల్లికి నాచే వియ్య మిప్పింపఁ దలఁ చితిరా? మోసపెట్టి గుంటలో ద్రోయ నెంచితిరిగా! మిగులు ప్రకరణముతోపాటీ ప్రకరణముగూడ నదిలోఁ బడుఁగాక!

బ్రహ్మ - పాఱవైచితిఁగాని ప్రతి పర్యాయమెదురు కొట్టుకొని వచ్చుచున్నది. అయ్యా! వినుఁడు! అది వలదని నిషేధించినను దమకు మనఃపూర్వకముగా గృతి నిచ్చుచున్నాను.

రామచయనులు కమండలూదకము బ్రహ్మశాస్త్రి మీఁదను దనకృతిమీఁదను బోసి - ఇదిగో శపించుచున్నాను. నీవును నీ పుస్తకమును మాసిపొందు! అనుచుఁ బరువెత్తుకొని పోయెను.

పిదపఁ గొన్నాళ్ల కీ కృతి యచ్చొత్తింపఁబడి ప్రచారములోనికి రాఁగా 'వీరే యీ కృతి కధిపతులఁని లోకులు చెప్పికొనఁగా నభిమానపడి తన పేరి మార్పుదలకై రామచయను లొకక్రొత్త క్రతువు నొనరింప యాచనకు బయలుదేరెను.

• *భారతి - మార్చి - 1925* •